ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
గురువారం 18 ఏప్రిల్ 2024





భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో రాములోరి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ములుగులో శ్రీరామ నవమి వేడుకల్లో కల్యాణం అనంతరం హనుమ లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలు

ఊరంతా పందిరి

అంగరంగ వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం

వాడవాడలా స్వామి వారి పెళ్లి సందడి

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్/ములుగు, ఏప్రిల్ 17: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పల్లెపల్లెనా పందిళ్లు వెలిశాయి. వాడవాడనా సందడి నెలకొంది. ఆలయాలన్నీ మండపాలయ్యాయి. భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేదపండితుల మంత్రోచ్చరణలు, బాజాభజంత్రీల నడుమ జరిగిన జగత్ కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తజనం తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ మహాఘట్టాన్ని తిలకించి పరవశించిపోయారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు మహదేవపూర్, కాటారం, గణపురం, రేగొండ, చిట్యాల, మల్హర్, టేకుమట్ల, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ముఖ్యంగా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర అనుబంధ రామాలయంలో ఈ వేడుకను కనులపండువగా నిర్వహించారు.

కాటారం మండలంలోని తన స్వగ్రామమైన ధన్వాడలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులతో కలిసి తమ స్వగృహం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలతో తరలివెళ్లి సమర్పించారు. భూపాలపల్లిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, భక్తాంజనేయ స్వామి ఆలయం, గణపురం మండలం బుద్దారంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, మండల కేంద్రంలోని శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం, రేగొండ మండలం రూపిరెడ్డిపల్లి, రావులపల్లిలోని ఆలయాల్లో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, గణపురం జడ్పీటీసీ గండ్ర పద్మ దంపతులు హాజరయ్యారు. భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణ పరిధి సుభాష్‌కాలనీలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి సింగరేణి జీఎం బళ్లారి శ్రీనివాస్ దంపతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు కన్నం యుగేందర్, మురళీధర్, శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో కౌన్సిలర్ ముంజాల రవీందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్‌దేవన్ దంపతులు హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సుభాష్‌కాలనీలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం పంపిణీ జరిగింది.



కాటారం మండలం ధన్వాడలో తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ములుగు జిల్లాలో..

ములుగు జిల్లాకేంద్రంతోపాటు మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లి, అబ్బాపురం, చిన్నగుంటూరుపల్లి, దేవగిరి పట్నం, ఇంచర్ల, జంగాలపల్లి, గోవిందరావుపేట, చల్వాయి, పస్రా, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు), వెంకటాపూర్(రామప్ప) మండలాల్లోని రామాలయాలలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అన్ని దేవాలయాల్లో నవమి వేడుకలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు బ్రాహ్మణోత్తములు వివాహ క్రతవును జరిపించారు. చాలా గ్రామాల్లో దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తూ సీతారాముల విగ్రహాలతో ఎదుర్కోలు, కన్యాదానం తంతులను నిర్వహించారు. ఊరుఊరంతా సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు తరలిరావడంతో సందడి నెలకొంది. కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు. దాతల సహకారంతో ఉత్సవ కమిటీలు భక్తులందరికీ అన్నం, పులిహోర ప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం హనుమంత సమేత సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. అందంగా అలంకరించిన వాహనాల్లో ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టారు. శ్రీరామ భజనలు, కీర్తనలు ఆలపిస్తూ కొలుచుకున్నారు. రామజన్మభూమి అయోధ్యలో 500ఏళ్ల తర్వాత నవమి వేడుకలు జరగ్గా, ఈ సందర్భాన్ని విశ్వహిందూ పరిషత్, ధర్మజాగరణ సమితి కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

రాములోరి పల్లకీ మోసిన ముస్లిం వ్యక్తి

భక్తికి కులమత బేధాలు ఉండవని నిరూపించాడు ఓ ముస్లిం వ్యక్తి. రాముల వారి పల్లకీని మోసి మతాల మధ్య బేషజాలు లేవని చాటిచెప్పాడు. భూపాలపల్లిలోని శ్రీభక్తాంజనేయ ఆలయం ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో పాల్గొన్న ఎస్.కె.పాషా సీతారాముల స్వామి పల్లకీని మోసి చూపరులను అబ్బురపర్చాడు.



భూపాలపల్లి సుభాష్‌కాలనీలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పద్మ దంపతులు



కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయం రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి దంపతులు



ములుగులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో(శ్రీక్షేత్రం) సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు



ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో నవమి వేడుకలు

భగ్గుమంటున్న భానుడు

» మండిపోతున్న ఎండలు » 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

ములుగు, ఏప్రిల్ 17: భానుడు భగ్గుమంటున్నాడు... ఎండలు మండుతున్నాయి. ఉదయించడంతోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. 7 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దీంతో జిల్లాలో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం మంగపేట మండలం మల్లూరు, వెంకటాపురం(నూగూరు)లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. అత్యల్పంగా జిల్లా కేంద్రంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తాడ్వాయి మండలం మేడారంలో 44.3, వెంకటాపూర్(రామప్ప) మండలం లక్ష్మీదేవిపేటలో 43.3, వాజేడు మండలం ధర్మవరంలో 43.1 ములుగు మండలం మల్లంపల్లిలో 42.2, ఏటూరునాగారంలో 42.8, గోవిందరావుపేటలో 42.5, కన్నాయిగూడెంలో 41.9డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది.

భూపాలపల్లి జిల్లాలో 44.4 డిగ్రీలు



భూపాలపల్లి పరిధి చల్లూరిపల్లిలో గొడుగుల నీడలో మిర్చి ఏరుతున్న మహిళా కూలీలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అన్ని మండలాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. రాబోయే మూడు రోజులు సైతం 43 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా రేగొండ మండలంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా టేకుమట్ల మండలంలో 41.1 డిగ్రీలు రికార్డయ్యింది. భూపాలపల్లి 42.1, గణపురం 43.9, కాటారం 43.8, మల్హర్ 43.8, చిట్యాల 43.7, మహాముత్తారం 42.9, మొగుళ్లపల్లి 42.7, పలిమెల 42.4, మహదేవపూర్‌లో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వనం వీడి జనంలోకి రండి

లొంగిపోయిన మావోయిస్టుల ఉపాధి మా బాధ్యత

ములుగు ఎస్పీ శబరీశ్



ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 17: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు వనం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, కాలం చెల్లిన సిద్ధాంతాల కోసం ప్రాణాలు కోల్పోవద్దని ములుగు ఎస్పీ శబరీశ్ కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొంతమంది మావోయిస్టు అగ్ర నాయకులు కాలం చెల్లిన సిద్ధాంతాల కోసం సామాన్య ప్రజల జీవితానికి విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇన్‌ఫార్మర్ నెపంతో అమాయకపు ఆదివాసీలను చంపుతూ, మందుపాతరలు పేల్చుతూ తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధించొచ్చనే అపోహ వదిలాలని హితవు పలికారు. ప్రభుత్వం ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల బాధ్యత నెరవేర్చే వ్యక్తిగా ఉండాలని సూచించారు. ములుగు జిల్లా నుంచి మావోయిస్టుపార్టీలో పనిచేస్తున్న నాయకులు, సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోవాలని, వారికి నగదు రివార్డుతోపాటు జీవనోపాధి కోసం పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామని తెలిపారు. లొంగిపోయేవారు ములుగు ఎస్పీ : 8712670100, ఓఎస్డీ : 8712670101, ఏటూరునాగారం ఏఎస్పీ : 8712670104, ములుగు డీఎస్పీ : 8712670103 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నామినేషన్ల స్వీకరణకు వేళాయె..



వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణపై ట్రయల్ నిర్వహిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

నేటి నుంచి లోక్‌సభ స్థానాలకు నామినేషన్లు
ఈ నెల 25 వరకు స్వీకరణ
26న పరిశీలన, 29న ఉపసంహరణలకు గడువు
మే 13న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు ఎన్నికలు
జూన్ 4న ఓట్ల లెక్కింపు
రెండు జిల్లాల కలెక్టరేట్‌లల్లో విస్తృత ఏర్పాట్లు
ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నారు. ఇందుకోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. మే 13న రెండు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఓట్ల కోసం ప్రజాక్షేత్రంలో మండుటెండను లెక్క చేయకుండా ప్రచారపర్వంలో చెమటోడ్చుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 4వ దశలో తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఇచ్చారు. 26వ తేదీన వచ్చిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో పరిశీలన చేయనున్నారు. 27 శనివారం, 28 ఆదివారం కావటంతో రెండు రోజులు సెలవులు. 29వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్ని కల గుర్తులను కూడా కేటాయించనున్నారు. మే 13వ తేదీన రెండు లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్లలో నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3గంటల తరువాత వచ్చే నామినేషన్లను స్వీకరించరని వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్‌డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన లైటింగ్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అభ్యర్థులు సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఈనెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే 21 లేదా 22వ తేదీన బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీష్‌రావు కవిత నామినేష్ల ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ నామినేషన్ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డాక్టర్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. అలాగే వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మొదటి సెట్ 22వ తేదీన దాఖలు చేస్తుండగా, 24వ తేదీన మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. 24వ తేదీన కావ్య నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మడికొండలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 24వ తేదీన నామినేషన్ వేయనున్నారు. అరూరి రమేష్ నామినేషన్ ఘట్టానికి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ 22వ తేదీన నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అధికారులు సిద్ధం

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. నగదు రవాణా, మద్యం అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌ల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఓట్ల వేటకు దిగుతున్నారు. కీలక నేతలను కలుసుకోవటంతో పాటు బూత్‌స్థాయి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో ఎన్నికల ప్రచారం మరింతగా హీటెక్కనుంది.

వరంగల్‌లో 18,16,543 మంది ఓటర్లు

మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు

జాబితాను సిద్ధం చేసిన అధికారులు

వివరాలు : 7వ పేజీలో..

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామని మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజవర్గ ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలకు ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఆ సమయంలో అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న ఉపసంహరణ ఉంటుందని, మే 13న పోలింగ్ ఉంటుందని వివరించారు.

డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 వరకు ఉంటుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

దివ్యాంగులకు హోం ఓటింగ్

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 15,30,367 మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. వీరిలో పురుషులు 7,46,982, మహిళలు 7,83,280 మంది, ఇతరులు 105 మంది ఉన్నట్లు వివరించారు. 1158 లోకేషన్లలో 1813 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు హోం ఓటింగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్ కుమార్ సింగ్

తల్లడిల్లిన మాతృమూర్తి

కన్నీరుమున్నీరవుతున్న మావోయిస్టు సుధాకర్ తల్లి

ఛత్తీస్‌గఢ్ బయల్దేరిన బంధువులు, గ్రామస్థులు



8లో

సుధాకర్ ఇంటి వద్ద రోదిస్తున్న తల్లి రాజపోచమ్మ

28 నుంచి దూరవిద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఈనెల 28 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 మే 5, 11, 12, 19,26, 27, 28, 29, 30 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. కేయూ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని తెలిపారు.

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ పంచశీల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, జనగామ ఆర్‌ఆర్‌ఎం కాలేజీ, ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ, కౌటలా శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ శ్రీఆరంపూర్, స్వాతి డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2లో రామగిరి రైలులో మంగళవారం ఓగుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల ఉంటుందని, తెల్ల గడ్డం, 5,4 ఎత్తు బ్లూషర్ట్‌పై వైట్‌లైన్స్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్ 87126 58609, 99498 59108కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: అమృత థియేటర్ సమీపంలోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన తన బిడ్డ అదృశ్యమైందని తండ్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో ఎంబీఏ చదువుతున్న యువతి(23) బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపునకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. చింతగట్టు క్యాంపునకు చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

డబ్ల్యూడీసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి మే 20వ తేదీ వరకు నెల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వరంగల్ మండిబజార్‌లోని డబ్ల్యూడీసీఏ కార్యాలయంలో డబ్ల్యూడీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో చాగంటి శ్రీనివాస్ పాల్గొని వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ 5 సెంటర్లను ఎంపిక చేయగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రీడాకారులకు గురువారంతో గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిసామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ప్రతీ సెంటర్‌లో పాల్గొనే క్రీడాకారులకు జంబో క్రికెట్ కిట్, మ్యాట్, బ్యాక్స్‌నెట్, గ్రేస్‌బాల్స్ టెన్నిస్‌బాల్స్‌తో పాటు శిబిరంలో పాల్గొనే ప్రతీ ఒక్క క్రీడాకారుడికి పౌష్టికాహారంగా కోడిగుడ్డు, అరటి పండ్లను ఉచితంగా అందిస్తామన్నారు. అదే విధంగా శిబిరాలలో కోచింగ్ ఇవ్వనున్న కోచ్‌లకు రూ.15వేలు, గ్రౌండ్ మెన్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శ్రీనివాస్ సూచించారు.

నేటితో ముగియనున్న స్వీకరణ

హెచ్‌సీఏ ఆదేశాల మేరకు డబ్ల్యూడీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌లో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ పేర్లను టీటీటీ.జియిటజీచిజ్బు.ౕటజ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుదని, శిక్షణా శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫామ్‌తో రావాలని కోరారు. శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు మే నెల చివరి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీడీఎల్ - 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడమే కాకుండా హెచ్‌సీఏ అకాడమీకి ఎంపిక చేస్తామన్నారు.

ఐదు జిల్లా కేంద్రాల్లో శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లా కేంద్రాలలోని క్రీడా మైదానాలలో శిక్షణా శిబిరాలను ఎంపిక చేశారు. వరంగల్ ఎల్బీ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు గోవిందసింగ్, బి.వేణు, మహిళా కోచ్ ఝాన్సీ సెల్ నెంబర్ 9849570979, పరకాల జూనియర్ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు బొజ్జం అరుణ్ సెల్ 9666206662, జయశంకర్ భూపాలపల్లి, సింగరేణి క్రీడా మైదానం కోచ్‌లు కర్ణాకర్, రాజ్‌కుమార్ సెల్ 8897805683, ములుగు తంగేడు క్రీడా మైదానంలో కోచ్‌లు మట్టెడ కుమార్, సందీప్‌నేత్ర సెల్ 9030130727, మహబూబాబాద్ సిద్ధార్థ హైస్కూల్ క్రీడా మైదానం కోచ్‌లు కుమార్, వినయ్ సెల్ 9866479666 నెంబర్‌లలో కోచ్‌లు అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రాఘురాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్, మటెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే ఆగమే..

- అభ్యర్థులు నేర సమాచారాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సిందే
- ఆస్తులు, అప్పులను చెప్పాల్సిందే..
- అన్ని కాలమ్స్ నింపాల్సిందే

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అభ్యర్థులు నామపత్రాలతో పాటు సమర్పించే అఫిడవిట్ పత్రాలు కీలకంగా మారుతాయి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పులు ప్రమాణరూపంలో ముందే స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులున్నా.. శిక్ష పడినా.. వాటిని పొందుపరుచాలి. వీటన్నింటిని కలిపి దాఖలు చేసే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారి తీయవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు 2023లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించినట్లు నిర్ధారించి, ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేర సమాచారం చెప్పాల్సిందే...

అభ్యర్థి తనపై క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటిని అఫిడవిట్‌లో పొందుపరచాలి. న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీలుకు వెళ్లినా వాటి సమాచారాన్ని, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలనూ తెలపాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైన నామినేషన్ దాఖలు చేస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలో మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలి. అలాగే అభ్యర్థులు తమపై నమోదైన కేసుల వివరాలు ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలివ్వాలి.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి..

స్థిర, చరాస్తులతో పాటు చేతిలో, ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్‌ను, బీమా పాలసీలను, అప్పులు తదితర సమాచారాన్ని పొందు పర్చాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్‌లో పొందుపరుచాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది పేర్కొనాలి. స్థిరాస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను వెల్లడించాలి.అభ్యర్థి తోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలు ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయమార్గాలు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపనీల కాంట్రాక్టులు ఉంటే వాటిని తెలుపాలి.

అభ్యర్థి వివరాలు తెలుసుకోవడం హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటరు హక్కు. అప్పుడే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫాం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్‌ను సమర్పించాలి.

అన్ని కాలమ్స్‌ను పూర్తి చేయాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలవద్దని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో నిల్ లేదా వర్తించదు అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే రిటర్నింగ్ అధికారి నోటీస్ ఇస్తారు. అప్పుడు సవరించిన అఫడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు.



ఫాం-26 నిబంధనలకు లోబడి ఉండాలి

తీగల జీవన్‌గౌడ్, న్యాయవాది



అభ్యర్థులు ఫాం-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు.

ఓటర్ల లెక్క ఇదీ..

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

వరంగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అలాగే ఓటును ఇతర ప్రాంతాలకు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. దీంతో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల పెరిగాయి. మొత్తంగా నెల రోజుల ఓటరు డ్రైవ్‌లో వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో కొత్తగా 114 ఓట్లు మాత్రమే పెరిగాయి. మహబూబాబాద్ పరిధిలో 3,369 ఓట్లు పెరిగాయి.

వరంగల్ లోక్‌సభ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం వరంగల్ లోక్‌సభ పరిధిలో మొత్తం 18,16,543మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208 మంది, ఇతరులు 395మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,892 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,874 మంది ఓటర్లు ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,030 మంది, వర్ధన్నపేట నియోజకరవ్గంలో 2,72,724మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 15,30,367 మంది ఓటర్లుండగా, పురుషులు 7,46,982 మంది, మహిళలు 7,83,280 మంది ఓటర్లు, ఇతరులు 105మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,58,451మంది ఓటర్లుండగా, నర్సంపేట నియోజకవర్గంలో 2,35,447 మంది, ములుగు నియోజకవర్గంలో 2,32,791 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	2,56,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

మానుకోట లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలో ఓటర్లు

డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	79,597	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

నెలరోజుల్లో స్వల్పంగా పెరిగిన ఓటర్లు..

లోక్‌సభ స్థానం	మార్చి 16 (2014)	ఏప్రిల్ 16(2024)	పెరిగిన ఓట్లు
వరంగల్	18,16,429	18,16,543	114
మహబూబాబాద్	15,26,998	15,30,367	3,369



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



వైభవంగా రాములోరి కల్యాణం



జగన్నాథపురంలో రాముల వారి కల్యాణ మహోత్సవం



తాటిచర్లలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



రూపిరెడ్డిపల్లి గ్రామంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మహదేవపూర్, ఏప్రిల్ 17: శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన రామాలయంలో బుధవారం ఉదయం 10.31 గంలకు ఆరుట్ల రామాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం నుంచి తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమర్పించారు. తారకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కల్యాణ దాతలు, అతిథులకు వేద పండితులు ఆశీర్వదించి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ఎస్సై భవానీ సేన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఏటూరునాగారం : మండల వ్యాప్తంగా శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వేద పండితులు ముక్కామల వెంకటనారాయణ శర్మ, మణికంఠ శర్మ, నాగేశ్వరరావు శర్మ కల్యాణ తంతును నిర్వహిం చారు. హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ మధసూదన్, స్థానిక ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. మండలంలోని రామన్నగూడెం, రాంనగర్, రొయ్యూరు, శంకరాజుపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఆంజనేయ స్వాములు, రామాలయం కమిటీ సభ్యులు అలువాల శ్రీనివాస్, పోగుల లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.
- మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణం కనుల పండుగలా సాగింది. అర్చకులు ప్రహ్లాద్‌శర్మ, శ్యామ్ సుందర్, మనోజ్ ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర స్వామికి, అమ్మవార్లకు రూ. 2.50లక్షలతో తాడిచర్ల గ్రామానికి చెందిన ఒల్లాల నవ్వసత్యనారాయణ దంపతులు ఆభరణాలు చేయించడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.
- వెంకటాపూర్(రామప్ప): మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. పారకలపల్లి, బూర్గుపేట, నారాయణపూర్ గ్రామాల్లోని దేవాలయాల్లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఆ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, నాయకులు శీలమంతుల రవీంద్రాచారి, దొంతిరెడ్డి రవీందర్‌రెడ్డి, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, గూడెపు సంతోష్, వినోద్, రాజేందర్ పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని రెవెన్యూ క్వార్టర్స్ ఆవరణలోని కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా నిర్వహించారు. అప్పాలవారి వీధి, గొల్లగూడెం, పాత్రా పురం, సూరవీడు, ఎదిర, మరికాల, బర్లగూడెం, ఆలుబాక, రామచంద్రా పురం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరగగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
- వాజేడు: మండలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణం జరిగింది. మండల కేంద్రంలోని రామాలయంతోపాటు జగన్నాథపురం, కొంగాల, చీకుపల్లి, పెద్దగొల్లగుడెం, ధర్మవరం, పేరూరు, చంద్రపట్ల గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, డప్పువాయిద్యాల నడుమ రాములవారి కల్యాణం అంగరంగా వైభవంగా జరిపించారు. ఆలయాలు, పందిళ్లలో జై శ్రీరామ్ నినాదాలు మర్మోగాయి. బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం జరిగింది.
- గణపురం, : మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని రామాలయం, బుద్ధారం లోని పర్వతవర్దని రామలింగేశ్వరస్వామి, చెల్పూరులోని సాంబమూర్తి ఆలయం, కేటీపీపీలోని రామాలయం, ధర్మరావుపేట, బస్వరాజుపల్లి పలు గ్రామాల్లో వేద పండితులు కనుల పండుగగా కల్యాణాన్ని జరిపించారు. బుద్ధారంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు పాల్గొన్నారు.
- తాడ్వాయి: మండలవ్యాప్తంగా బుధవారం మండల ప్రజలు శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తాడ్వాయి, ఇందిరానగర్, నర్సింగాపూర్, కామారం, ఎస్టీకాలనీ, దామెరవాయి, కాటాపూర్, లింగాల, బీరెల్లి, రంగాపూర్, తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. కాటాపూర్, దామెరవాయి, తాడ్వాయి, తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో డోలువాయిద్యాల నడుమ భక్తులు నృత్యాలు చేస్తూ ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు.
- కన్నాయిగూడెం: మండల కేంద్రంతోపాటు గుర్రేవుల, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఏటూరు, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తుల కోసం చలువ పందిళ్లు, తాగు నీరు ఏర్పాటు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.
- రేగొండ : మండలంలోని రావులపల్లి, రూపిరెడ్డిపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై కల్యాణాన్ని వీక్షించారు. రావులపల్లి రామాలయ చైర్మన్ గండ్రెడ్డి లింగారెడ్డి, రూపిరెడ్డిపల్లిలోని సీతారామాంజనేయస్వామి ఆలయ చైర్మన్ ప్రభాకర్‌రెడి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సాంబారి సాయి, ఆలయ కమిటీ సభ్యులు ముడుతనపల్లి శంకరయ్య, బండారి రవి, ఎంపీటీసీ ఐలి శ్రీధర్, మాజీ సర్పంచ్ బండారి కవిత తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మండలకేంద్రంలోని సాంబమూర్తి దేవాలయం, రంగాపురం రామాలయం, పోతుగల్ రామాలయంలో కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో అర్చకులు దెబ్బేట శ్రీధరాచార్యులు, శ్రీనివాసచార్యులు, వెంకన్నాచార్యులు, పద్మనాభాచార్యులు, మాజీ సర్పంచ్‌లు మోటె ధర్మారావు, బల్గూరి తిరుపతిరావు పాల్గొన్నారు.
- కాటారం: మండలంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. మండలంలోని ధన్వాడ దత్తాత్రేయస్వామి, గారెపల్లి భక్తాంజనేయస్వామి, కాటారం అభయాంజనేయ స్వామి, బొప్పారం సీతారామాంజనేయస్వామి, చింతకాని చెన్నకేశవస్వామి, గూడూరు, గంగారం ఆంజనేయ స్వామి ఆలయాల ఆవరణలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.. సొంత గ్రామమైన ధన్వాడలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. దేవేరుల కల్యాణానికి మంత్రి శ్రీధర్‌బాబు వందలాది మంది భక్తులతో కలిసి తమ స్వగృహం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకెళ్లి సమర్పించారు. సీతారాముల ఆశీస్సులతో యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం, మంథని నియోజకవర్గ ప్రజలు బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని మొక్కుకున్నట్లు వెల్లడించారు. ఆయా ఆలయాల్లో వేద పండితులు కృష్ణమోహన్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, గణేష్ శర్మ, ఆశీష్‌శర్మ, నాగరాజుశర్మ, నిఖిల్‌చారి, సముద్రాల రామాచార్యులు, కిష్టయ్యపంతులు వందలాదిమంది భక్తుల సమక్షంలో కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు.

ధైర్యంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బాబా సాహెబ్



ఫ్లాగ్‌మార్చ్‌లో మాట్లాడుతున్న ఏఎస్పీ

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 17: ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్ సూచించారు. మండలంలోని ఆలుబాక గ్రామంలో బుధవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు సంఘవిద్రోహ శక్తుల నుంచి ఎలాంటి భయాందోళనలకు గురికాద్దన్నారు. తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బండారి కుమార్, ఎస్సైలు కొప్పుల తిరుపతిరావు, అశోక్, వెంకటేశ్వర్‌రావు, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 17 : హనుమాన్ మాలాధారణలో ఉన్న విద్యార్థులను పరీక్షకు అనుమతించని మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నెపల్లి మదర్‌థెరిసా పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏటూరునాగారం హనుమాన్ మాలాధారణ గురు స్వాములు రమేష్, సాంబయ్య, కాశ్ల రాము, శివకుమార్, సురేష్, రాజేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. మాలధారణ చేసిన నాలుగో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు పాఠశాలకు వెళ్లడంతో యాజమాన్యం అనుమతించలేదన్నారు. కాషాయపు వస్త్రాలు తొలిగించి పాఠశాల యూనిఫామ్ ధరిస్తేనే పరీక్షకు అనుమతిస్తామని అనడం దారుణమన్నారు. హనుమాన్ స్వాముల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన పాఠశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



శేషాచలం పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు



శేషాచలం (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 17: మండలంలోని వీఆర్కేపురం ఎంపీపీ స్కూల్ హెడ్‌మాస్టర్ శేషాచలం గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి సోలం కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి ఏళ్ల మధుసూదన్‌తోపాటు ఆ సంఘం పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు. శేషాచలం పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం తరఫున బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, రమణయ్య, నాయకులు రాజు, రాంబాబు, లాలయ్య, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, పీరయ్య ఉషారాణి, శ్యామల, నాగేశ్వర్‌రావు, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాటారం, ఏప్రిల్ 17: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా నాలుగు మండలాల్లోని 33/11 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. సింగిల్ ఫేజ్ సరఫరా ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

వైభవంగా శ్రీరామాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కాటారం, ఏప్రిల్ 17: మండలంలోని బొప్పారంలో శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ద్వితీయ వార్షిక త్రైయాహ్నిక బ్రహ్మోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. అర్చకులు స్వస్తిపుణ్యాహవచనం, ధ్వజారోహణం, తిరుమంజనం, విష్ణుసహ స్రనామ పారాయణం, విశ్వక్సేన పూజ, యజ్ఞం, దేవతాహ్వానం, సీతారాముల కళ్యాణం చేసి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో శ్రీ సీతారామచంద్రులను, ఆంజనేయుడిని దర్శించుకుని మొక్కుకున్నారు. సాయంత్రం భక్తుల జయజయధ్వానాల మధ్య లక్ష్మీదేవర విన్యాసాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర నందగోపాల్, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 17 : మండల కేంద్రంలోని మందరగిరి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలతో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం కాగా మధ్యాహ్నం 3.30 గంటలకు గరుడపూజ జరిగింది. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కల్యాణ మండపానికి తీసుకురాగా వేద మంత్రాల నడుమ కల్యాణం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో అర్చకులు నవీణాచార్యులు, శశాంక్, నగేష్, పవన్, జడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీపీ బన్సోడ రాణిబాయి, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతయ్య, కాళేశ్వరం ఆలయ ధర్మకర్త కుంభం పద్మ, కోట రాజబాపు, వామన్‌రావు, అన్కారి ప్రకాశ్, మాజీ చైర్మన్ ఒడేటి రవీందర్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ చీర్ల తిరుపతి, ఆకుతోట సుధాకర్ తదిరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, పలిమెల ఎస్సై తమాషారెడ్డి భద్రతను పర్యవేక్షించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి మడక మధు, సామాజిక సేవ వేత్త గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగను పంపిణీ చేశారు.

మావోయిస్టు సాంబయ్య కుటుంబానికి పోలీసుల చేయూత

జనజీవన స్రవంతిలో కలవాలని సీఐ సూచన



సాంబయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ శంకర్

గోవిందరావుపేట, ఏప్రిల్ 17: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు రాష్ట్ర నాయకుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న కుటుంబానికి పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ బుధవారం నిత్యావసర సరుకులు అందించారు. ఈసందర్భంగా వారు సాంబయ్య తల్లిదండ్రులు, భార్య ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీఐ శంకర్ మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున ఉపాధి కల్పిస్తామని అన్నారు. హింసా దోరణి అవలంబించడం వల్ల ఎంతోమంది అడవుల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమనే సిద్ధాంతాలతో ప్రజలను, కిందిస్థాయి మావోయిస్టులను తప్పుదోవ పట్టిస్తూ ముఖ్యనేతల మరణాలకు అగ్రనాయకులు కారణమవుతున్నారని విమర్శించారు. అజ్ఞాతంలో ఉన్న సాంబయ్య లొంగిపోయి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకుంటూ మంచి జీవితం గడపాలని కోరారు. లొంగిపోయే మావోయిస్టులు పస్రా సీఐ : 8712670112, ఎస్సై : 8712670085 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తల్లడిల్లిన సుధాకర్ మాతృమూర్తి

చిట్యాల, ఏప్రిల్ 17: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్, బస్తర్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సిరిపెల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు స్వగ్రామం చిట్యాల మండలం చల్లగరిగలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రాణాలతో తిరిగి వస్తాడనుకున్న కొడుకు ఇలా అజ్ఞాత వాసంలోనే అసువులు బాసాడని తెలియడంతో తల్లి రాజపోచమ్మ తల్లడిల్లిపోయింది. అన్నపానీయాలు మాని వెక్కివెక్కి రోదిస్తోంది. 25 ఏళ్లగా అజ్ఞాతంలో ఉన్న సుధాకర్ మృతిచెందాడన్న వార్తను బంధువులు, గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంతకుముందు రెండుసార్లు ఇలాంటి వదంతులు వచ్చాయని, ఈసారి సైతం అదే నిజం కావాలని కోరుకుంటున్నారు.

సుధాకర్ మృతి చెందినట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. స్థానిక పోలీసులు మాత్రం ధ్రువకరించ లేదు. ఈ నేపథ్యంలో సుధాకర్ బంధువులు, గ్రామస్థులు బుధవారం సాయంత్రం స్థానిక పోలీసులను కలిశారు. మృతదేహాల్లో సుధాకర్‌ను గుర్తించేందుకు ఐదుగురు ప్రైవేటు వాహనంలో ఛత్తీస్‌గఢ్‌కు బయల్దేరారు. ప్రయాణ ఖర్చులకు చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో గ్రామస్థులతోపాటు పలువురు దాతలు సహకరించినట్టు తెలిసింది.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ములుగు అగ్నిమాపక కేంద్ర అధికారి ఎమ్డీ.అబ్దుల్ రహీం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ములుగు మండలంలోని మల్లంపల్లిలో బుధవాం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం అగ్నిప్రమాదాల నియంత్రణ కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది నగేష్, మధుసూదన్, భార్గవ్, మహేందర్ పాల్గొన్నారు.

డ్రెయినేజీల పరిశీలన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న కౌన్సిలర్ ముంజాల రవీందర్‌గౌడ్

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 17: భూపాలపల్లి పట్టణంలోని 22వ వార్డులోని డ్రెయినేజీలను కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్ బుధవారం పరిశీలించారు. గణేష్ చౌరస్తాలోని డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉండటంపై మునిసిపల్ అధికారులపై మండిపడ్డారు. డ్రెయినేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వస్తోందని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఎ వార్డులో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి



సాయిలు (ఫైల్)

గణపురం, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తొలిదశ ఉద్యమకారుడు ముక్కెర సాయిలు (80) మంగళవారం రాత్రి మృతి చెం దారు. పది రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయన తుది శ్వాస విడిచారు. గణపురం మండల కేంద్రానికి చెందిన సాయిలు తెలంగాణ తొలి దశ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించి జైలు జీవితాన్ని కూడా గడిపారు. బీఆర్ఎస్‌లో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

మిర్చి పంటతో తంటా



ఏరకుండానే వదిలేసిన మిర్చి పంట

మల్హర్, ఏప్రిల్ 17: ఈ ఏడాది మిర్చి పంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. గత ఏడాది మిర్చికి ధర ఎక్కువగా ఉండటంతో మండలంలో ఈ ఏడాది కొంత మేర సాగు విస్తీర్ణం పెరిగింది. ధర రూ. 35 వేలు పలకడంతో గత ఏడాది ఫిబ్రవరిలోనే ఎకరానికి రూ 50 వేలు చొప్పున కౌలు చెల్లించి రైతులు పంటను సాగు చేశారు. ఈ ఏడాది మాత్రం మిర్చి ధర రోజు రోజుకూ తగ్గడంతో కౌలుకు ఎవరూ ముందుకు రాలేదని తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రారంభం నుంచే మిర్చి ధర క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది మొదట్లో రూ. 21 వేల నుంచి 23 వేలకు వరకు ఉండగా ప్రస్తుతం మిర్చి ధర రూ. 8 వేల నుంచి 10 వేల లోపే ఉన్నట్లు రైతులు అంటున్నారు. దీంతో పెట్టుబడుల సంగతి దేవుడెరుగు.. అప్పుల బాధ తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 22 వందల ఎకరాల్లో 1,225 మంది రైతులు మిర్చిని సాగు చేస్తున్నారు. తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, గాదంపల్లి, అడ్వాలపల్లి, కిషన్‌రావు, కొండపేట, తాడ్వాయి, మల్లంపల్లి, అన్‌సాన్‌పల్లి, నాచారంతోపాటు పలు గ్రామాల్లో ఈ పంటను చేశారు. గత ఏడాదితో పోలిస్తే మిర్చి పంట దిగుబడి తగ్గకపోయి ధర లేక పోవడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మిర్చిలో వండర్‌హట్, దీపిక, 341 సీడ్ రకాలను ఎక్కువగా సాగు చేశారు. మొదట్లో మిర్చి సాగుకు వాతావరణం అనుకూలించినా పూతల పురుగు, వేరుకుళ్లు రోగంతో పంటలు దెబ్బతిన్నాయి. పంటపై ఆశ వదులుకోని రైతులు మళ్లీ మిర్చి పంటను వేయగా తెగుళ్లు సోకాయి. దీంతో పలువురు వేరే పంటను వేశారు. మిర్చి పంటను వేసిన రైతులు రెండు నెలలుగా తమ ఉత్పత్తులను మార్కెట్ తరలిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఏ ఒక్క రైతుకూ క్వింటాల్‌కు ధర రూ. 18 వేలు వచ్చింది లేదని తెలుస్తోంది. గత ఏడాది కూడా ధర రూ.35 వేలు పలకడంతో ఇంకా పెరుగుతుందన్న నమ్మకంతో పంటను విక్రయించకుండా రైతులు పెద్ద మొత్తంలో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ప్రస్తుతం తమ పరిస్థితి రెంటికి చెడ్డ రేవుల తయారైందని వారు ఆవేదన చెందుతున్నారు. తక్కువ ధరకు పంటను అమ్మడం ఇష్టం లేని రైతులు వరంగల్ కోల్డ్‌స్టోరేజీలు నిండిపోవడంతో ఖమ్మం కోల్డ్‌స్టోరీలకుతరలించారు. మొదటి దఫా పంటను అమ్ముకొని వచ్చిన రైతులకు ధర వల్ల పెట్టుబడి కూడా వెళ్లలేదని తెలుపుతున్నారు. మిర్చి ధర, ఖర్చులకు బయపడి కొంత మంది పంటను ఏరిపించేందుకు కూడా ధైర్యం చేయడం లేదు. దొడ్డు రకం మిర్చి ధర ఉన్నప్పటికీ ఎవరూ సాగు చేయలేదు. ఈ నేపథ్యంలో వరుస నష్టాలను చవిచూసే బదులు రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మిర్చికి ఎరువుల వాడకం ఎక్కువగా ఉండటం వల్ల భూసారం తగ్గి తెగుళ్లు సోకే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు. మిర్చి రైతులకు అధికారులు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.